

RNI: APTEL/2010/36742

# న్యూస్ వార్
వార్తా పత్రిక

విలేకరులు కావలెను
తెలుగు భాషపై పట్టు స్థానిక సమస్యలపై అవగాహన కలిగిన ఉత్సాహవంతులైన
యువతి యువకులకు జర్నలిస్ట్‌గా పనిచేసేందుకు సదావకాశం
న్యూస్ వార్ దిన పత్రిక
నూతన ఒరవడి ప్రత్యేక కథనాలతో మీ ముందుకు వస్తున్న న్యూస్‌వార్ దిన పత్రికలో
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు,నియోజకవర్గాలు, మండల కేంద్రాలల్లో
వార్తాసేకరణకు విలేకరులు కావలెను ఆసక్తి కలవారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించండి.
94409 91979

నల్లగొండ | epaper.news war.com | శనివారం 2, మే 2026 | సంపుటి :16 సంచిక :38 | ఎడిటర్: కృష్ణారావు నటవ | పేజీలు : 4 , వెల.2.00

## నాణ్యమైన విత్తనాలనే రైతులకు
# అందుబాటులో ఉంచాలి

**నాసిరకం విత్తనాలను అరికట్టేందుకు కఠిన చర్యలు : మంత్రి తుమ్మల**

హైదరాబాద్

రైతులకు నాణ్యమైన, అధిక దిగుబడి ఇచ్చే విత్తనాలు అందుబాటులో ఉంచాలని అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయశాఖ, సీడ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్, విత్తన కంపెనీ ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ..నాసిరకం విత్తనాలను అరికట్టేందుకు పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలని సూచించారు. వానాకాలం పంటలో భాగంగా సుమారు 134.66 లక్షల ఎకరాల్లో సాగు జరిగే అవకాశముండగా దానికి 19.42 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయని అంచనా ఉందనీ, ప్రస్తుతం రాష్ట్రంలో 38.21 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సుమారు 52 లక్షల ఎకరాల పత్తి సాగు లక్ష్యంతో రైతులకు అవసరమైన 104 లక్షల ప్యాకెట్లకు బదులుగా 212.11 లక్షల ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని చెప్పారు.

వార్త 2లో





## సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ధన్యవాదాలు

- ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చడం కోసం కృషి
- ప్రస్తుతం తెలంగాణ పోలీస్ దేశంలోనే నంబర్ వన్
- టెక్నాలజీ వినియోగంలో తెలంగాణ పోలీస్ దేశంలోనే మొదటి స్థానం
- సైబర్ నేరాలను అదుపు చేయడంలో జిల్లా ఎస్పీల పాత్ర కీలకం
- తెలంగాణ పోలీస్ శాఖలో పునర్వ్యవస్థీకరణ
- డీజీపీ సీవీ ఆనంద్

వివరాలు 2లో..



## మేడే రోజు కేటీఆర్ బుద్ధిలేని మాటలు మాట్లాడుతున్నారు : అద్దంకి దయాకర్

మాజీ మంత్రి కేటీఆర్‌పై ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. మేడే రోజు కేటీఆర్ బుద్ధిలేని మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సందర్భానుసారంగా మాట్లాడటం కేటీఆర్ నేర్చుకోవాలని హితవుపలికారు. మేడే రోజు కార్మికులు, వారి సంక్షేమం గురించి మాట్లాడాలన్నారు.

2

## ఫార్మా ల్యాబ్‌లో పేలిన రియాక్టర్..
# 9 మందికి గాయాలు



నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పేరేపల్లి గ్రామశివారులోని నోష్ ఫార్మా ల్యాబ్‌లో ఈరోజు (శుక్రవారం) రియాక్టర్ పేలింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. మేడే రోజే ఈ దుర్ఘటన జరగడం కార్మికులలో ఆందోళనను మరింత పెంచింది. పేరేపల్లి గ్రామ శివారులో ఉన్న నోష్ ఫార్మా కంపెనీలోని బ్లాక్-3లో ఈరోజు ఒక్కసారిగా రియాక్టర్ పేలింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో బ్లాక్‌లో పని చేస్తున్న 9 మంది కార్మికులు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం.

వార్త 2లో

## ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి: మంత్రి పొన్నం

2 లో..

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని తెలిపారు. 140 సంవత్సరాలుగా ఏదో ఒక హక్కు డిమాండ్‌తో మేడే నిర్వహించుకుం టున్నామని పేర్కొన్నారు.



2



## మెడికల్ సీట్ల పేరిట మోసాలు.. తల్లిదండ్రులారా.. జాగ్రత్త!: సీపీ సజ్జనార్

## కార్మికుల కన్నీటి చుక్కలే నాగరికత చరిత్రకు సిరా: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్,



మేడే సందర్భంగా కార్మిక సోదరులందరికీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల కన్నీటి చుక్కలే నాగరికత చరిత్రకు సిరా అని అభివర్ణించారు. కార్మికులే నూతన చరిత్ర రచయితలు అని పేర్కొన్నారు. శ్రమజీవుల కన్నీళ్లే అభివృద్ధి చరిత్రకు ఆధారమని తెలిపారు. కార్మికుల త్యాగమే సమాజ ప్రగతికి పునాది అని చెప్పుకొచ్చారు. శ్రమజీవుల శ్రమే నాగరికత నిర్మాణానికి మూలమని, కార్మికుల జీవితమే అభివృద్ధి చరిత్రకు సాక్ష్యమని సీఎం వ్యాఖ్యానించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన పోస్టు చేశారు.

## కవిత భయం వల్లే కేసీఆర్ బయటకు వస్తున్నారు: పీసీసీ చీఫ్

హైదరాబాద్,

తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవితకు పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ థాంక్స్ చెప్పారు. కవిత వల్లే మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మేల్కొంటు న్నారని వ్యాఖ్యానించారు. కవిత భయం వల్లే కేసీఆర్ బయటకు వస్తున్నారన్నారు. హైడ్రా గురించి కేసీఆర్ చదువుకుంటే మంచిదని హితవుపలికారు. కబ్జాల నుంచి విముక్తి కల్పిస్తే కేసీఆర్‌కు వచ్చిన ఇబ్బంది ఏంటి అని ప్రశ్నించారు. హైడ్రా వల్ల బీఆర్ఎస్ నాయకులకు ఇబ్బంది కలుగుతోందన్నారు. సిటీ చుట్టూ ఉన్న చెరువులను ఆ పార్టీ నేతలే కబ్జా చేశారని ఆరోపించారు. గులాబీ పార్టీ నేతలు ఎందుకు సభలు పెడుతున్నారని పీసీసీ చీఫ్ నిలదీశారు. తాము చేసిన డిక్లరేషన్లు అమలు చేస్తున్నామని.. త్వరలోనే పదవుల భర్తీ ఉంటుందని స్పష్టం చేశారు. నాలుగు రోజుల క్రితం పదవుల భర్తీపై చర్చించినట్లు తెలిపారు. మంత్రివర్గ విస్తరణపై సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకుంటారని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.



2



## కమర్షియల్ గ్యాస్ ధర పెంపుపై మంత్రి ఉత్తమ్ సీరియస్..

# సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ధన్యవాదాలు

ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చడం కోసం కృషి

ప్రస్తుతం తెలంగాణ పోలీస్ దేశంలోనే నంబర్ వన్

టెక్నాలజీ వినియోగంలో తెలంగాణ పోలీస్ దేశంలోనే మొదటి స్థానం

సైబర్ నేరాలను అదుపు చేయడంలో జిల్లా ఎస్పీల పాత్ర కీలకం

తెలంగాణ పోలీస్ శాఖలో పునర్వ్యవస్థీకరణ

డీజీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

తనపై నమ్మకంతో రాష్ట్ర డీజీపీగా నియమించిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సీవీ ఆనంద్ ధన్యవాదాలు తెలియజేశారు. శుక్రవారం డీజీపీ మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చడం కోసం పూర్తిస్థాయిలో అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ పోలీస్ దేశంలోనే నంబర్ వన్ పోలీస్‌గా గుర్తింపు పొందిందని.. బ్రాండ్ ఇమేజ్ సాధించిందని అన్నారు. శాంతి భద్రతలు కాపాడటం, నేర నియంత్రణ, నేర దర్యాప్తులో తెలంగాణ పోలీసులు సమర్థవంతంగా పని చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. శాంతి భద్రతలు కాపాడటంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని డీజీపీ సూచించారు. కేసుల దర్యాప్తులో టెక్నాలజీ వినియోగంలో తెలంగాణ పోలీస్ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని డీజీపీ తెలిపారు. గతంలో కంటే ఇప్పుడు నేరాల్లో మార్పులు వచ్చాయని, ప్రస్తుతం సైబర్ నేరాలు భారీగా పెరిగాయన్నారు. సైబర్ నేరాలను అదుపు చేయడంలో జిల్లా ఎస్పీల పాత్ర కీలకంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ సమస్య ఇప్పుడు సమాజంలో విస్తరించిందని.. దాన్ని అరికట్టడం కోసం ఈగిల్, నార్కోటిక్స్ సెల్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. తెలంగాణలో డ్రగ్స్ నిర్మూలనకు టాప్ ప్రయారిటీ ఇస్తామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరోను ఏర్పాటు చేయబోతున్నట్లు సీవీ ఆనంద్ ప్రకటించారు. మహిళల సేఫ్టీ, చైల్డ్ ట్రాఫికింగ్ వంటి సమస్యలు వ్యవస్థీకృత నేరాలుగా మారాయని.. వీటిపై ప్రత్యేక దృష్టి పెడతామని డీజీపీ తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల వచ్చే ప్రమాదాలపై కూడా పోలీసు శాఖ మరింత దృష్టి సారిస్తుందన్నారు. తెలంగాణ పోలీస్ శాఖలో పునర్వ్యవస్థీకరణ చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. నక్సలైట్ల నిర్మూలన కోసం ఏర్పాటైన గ్రేహౌండ్స్, ని సరైన విధంగా పోలీస్ శాఖలో వినియోగించుకోవాలని సూచించారు. పోలీస్ శాఖలో ఉన్న ఖాళీలపై త్వరలో ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని.. రిక్రూట్‌మెంట్, ట్రైనింగ్‌లో మార్పులు తీసుకొస్తామని డీజీపీ తెలిపారు. ప్రైవేటు సెక్టార్‌లో ఉపయోగిస్తున్నా×ని పోలీస్ శాఖలో కూడా అమలు చేస్తామన్నారు. పోలీస్ శాఖలో అధికారులు.. సంప్రదాయాలు, మర్యాదలు మరచిపోతున్నారని సీవీ ఆనంద్ అన్నారు. వాటిని గుర్తు చేసి, అధికారులు సమన్వయంతో పని చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నేర దర్యాప్తులో సీసీ కెమెరాలపై మాత్రమే ఆధారపడటం సరికాదని.. సీన్ ఆఫ్ అఫెన్స్‌లో దొరికిన ఆధారాలతోనే కేసులను ఛేదించే పాత పద్ధతులను మళ్లీ తీసుకొస్తామని స్పష్టం చేశారు. గోవధపై పోలీసులే చర్యలు తీసుకుంటారని, ప్రైవేటు వ్యక్తులు రోడ్లపైకి రావొద్దని సీవీ ఆనంద్ హెచ్చరించారు.

# మేడే రోజు కేటీఆర్ బుద్ధిలేని మాటలు మాట్లాడుతున్నారు: అద్దంకి దయాకర్

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

మాజీ మంత్రి కేటీఆర్‌పై ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. మేడే రోజు కేటీఆర్ బుద్ధిలేని మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సందర్భానుసారంగా మాట్లాడటం కేటీఆర్ నేర్చుకోవాలని హితవుపలికారు. మేడే రోజు కార్మికులు, వారి సంక్షేమం గురించి మాట్లాడాలన్నారు. మూడేళ్లయినా ముఖ్యమంత్రి పని చేయడం లేదని కేటీఆర్ అంటున్నారని.. పదేళ్లు పని చేయని సీఎంను ఏమనాలని ప్రశ్నించారు. కేవలం సీఎంపై విమర్శలతోనే పార్టీని నెట్టుకురావాలని అనుకోవడం దౌర్భాగ్యమన్నారు. కార్మికుల కోసం ఏం చట్టాలు చేశామో కూడా కేటీఆర్‌కు తెలియదన్నారు. గిగ్ వర్కర్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేసిన విషయం తెలియదా అని దయాకర్ ప్రశ్నించారు. పదేళ్లలో కార్మిక చట్టాలు, సంక్షేమం గురించి మున్సిపల్ మంత్రిగా కేటీఆర్ ఎలా స్పందించారో అందరికి తెలుసన్నారు. సీఎంపై హాట్ కామెంట్స్‌తో నిరంతరం మీడియాలో ఉండాలన్న తపన తప్పితే కేటీఆర్‌కు ఇంకో పని లేదని విమర్శించారు. తెలంగాణ భవన్‌కు ఎవరినో ఒకరిని పిలిపించుకుని చిల్లర మల్లర అహంభావపూరిత మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిల్లర మాటల వల్ల బీఆర్ఎస్ గుండు సున్నా స్థాయికి వచ్చిందన్నారు. సీఎంపై, సీఎం కుటుంబంపై మాట్లాడితే ఉపయోగం ఉండదన్నారు. ప్రజా నాయకుడిగా రేవంత్ రెడ్డి ఎదుగుతున్న తీరు నచ్చకే కేటీఆర్ విమర్శలు చేస్తున్నారని అద్దంకి దయాకర్ వ్యాఖ్యానించారు.

# మెడికల్ సీట్ల పేరిట మోసాలు.. తల్లిదండ్రులారా.. జాగ్రత్త!: సీపీ సజ్జనార్

హైదరాబాద్,

నీట్ యూజీ పరీక్ష నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ కీలక సూచనలు చేశారు. వైద్య విద్యపై ఉన్న అపారమైన క్రేజ్‌ను పెట్టుబడిగా మార్చుకోవాలని కొందరు మోసగాళ్లు, దళారులు ప్రయత్నిస్తున్నారు. తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్త వహించాలని సోషల్ మీడియా ఎక్స్ వేదికగా సీపీ విన్నవించారు. 'మీ పిల్లలు నీట్‌లో తక్కువ మార్కులు సాధించినా, మేనేజ్‌మెంట్ కోటాలో చాలా తక్కువ ధరకే ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తామని లేదా ఫిలిప్పీన్స్, కిర్గిజ్‌స్థాన్, కజకిస్థాన్, జార్జియా, చైనా, అర్మేనియా, కరేబియన్ దేశాల్లో అతి తక్కువ ఖర్చుతో వైద్య విద్య పూర్తి చేయవచ్చని ఆకర్షణీయంగా చెప్పి మోసం చేసే ఏజెంట్ల మాటలు నమ్మవద్దు' అని హెచ్చరించారు. గతంలో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇలాంటి ముఠాలు అనేక మంది తల్లిదండ్రులను మోసం చేశాయని సీపీ గుర్తుచేశారు. ఎందరో తల్లిదండ్రులు కష్టపడి సంపాదించిన డబ్బును కోల్పోగా, విద్యార్థులు విలువైన సంవత్సరాన్ని కోల్పోయిన సంఘటనలు అనేకం ఉన్నాయన్నారు. విదేశీ వైద్య కళాశాలలో అడ్మిషన్ తీసుకోవాలనుకుంటే.. ఆ కాలేజీకి భారత ప్రభుత్వం నేషనల్ మెడికల్ కమిషన గుర్తింపు ఉందో లేదో అధికారిక వెబ్‌సైట్‌లో తప్పకుండా పరిశీలించాలని.. లేదా స్వయంగా అధికారులను సంప్రదించి నిర్ధారించుకోవాలని సూచించారు. అడ్మిషన్ల పేరుతో దళారుల చేతికి నగదు రూపంలో లక్షల రూపాయలు ఇవ్వొద్దని సజ్జనార్ తెలిపారు. ఏ ఫీజులు చెల్లించాల్సి వచ్చినా నేరుగా సంబంధిత యూనివర్సిటీ, కాలేజీ బ్యాంక్ ఖాతాకే చెల్లించాలన్నారు. విద్యార్థులు ఎంతో కష్టపడి సాధించిన ఫలితాలను, భవిష్యత్తు కలలను ఈ నకిలీ ఏజెంట్ల చేతుల్లో పెట్టి ఆందోళనకు గురికావద్దని సూచించారు.

# నాణ్యమైన విత్తనాలనే రైతులకు అందుబాటులో ఉంచాలి

## నాసిరకం విత్తనాలను అరికట్టేందుకు కఠిన చర్యలు : మంత్రి తుమ్మల

-హైదరాబాద్

రైతులకు నాణ్యమైన, అధిక దిగుబడి ఇచ్చే విత్తనాలు అందుబాటులో ఉంచాలని అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయశాఖ, సీడ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్, విత్తన కంపెనీ ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాసిరకం విత్తనాలను అరికట్టేందుకు పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలని సూచించారు. వానాకాలం పంటలో భాగంగా సుమారు 134.66 లక్షల ఎకరాల్లో సాగు జరిగే అవకాశముండగా దానికి 19.42 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయని అంచనా ఉందనీ, ప్రస్తుతం రాష్ట్రంలో 38.21 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సుమారు 52 లక్షల ఎకరాల పత్తి సాగు లక్ష్యంతో రైతులకు అవసరమైన 104 లక్షల ప్యాకెట్లకు బదులుగా 212.11 లక్షల ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని చెప్పారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న హైబ్రిడ్ విత్తనాలను ప్రాధాన్యంగా సరఫరా చేయాలని సూచించారు.విత్తనాల నాణ్యతపై రాజీ పడకూడదనీ, సీడ్ టెస్టింగ్ ల్యాబ్‌ల ద్వారా నిరంతర పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. నాణ్యత లేని విత్తనాల తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో కేసులు నమోదు చేసి లైసెన్సులు రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి నెలాఖరులో కంపెనీలు తమ స్టాక్ వివరాలను ప్రభుత్వానికి అందజేయాలనీ, సెల్ఫ్ సర్టిఫైడ్ విత్తనాల వల్ల నష్టం కలిగితే కంపెనీలే భరించాలని సూచించారు. కంపెనీలు తమ విత్తనాల స్టాక్‌ను మే 15 నుండి రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీడ్ కార్పోరేషన్ డెవలప్ మెంట్ చైర్మెన్ అన్వేష్‌రెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, మార్క్ ఫెడ్ ఎమ్‌డీ శ్రీనివాస్ రెడ్డి, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, వ్యవసాయశాఖ అడిషనల్ డైరెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. మంత్రి తుమ్మలను కలిసిన డెవలప్‌మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ప్రతినిధులు డెవలప్‌మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్ ప్రతినిధులు సచివాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. రైతులకు వాతావరణ పరిస్థితులపై సలహాలు అందించే దిశగా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఒడిశా, తెలంగాణతో పాటు పలు రాష్ట్రాలలో పైలట్ ప్రాజెక్ట్‌గా తమ సంస్థ స్వతంత్రంగా పనిచేస్తోందని తెలిపారు. తమ సమాచారంతో రైతులు నాట్లు వేయాల్సిన సమయం, పంట కోతలు చేపట్టాల్సిన సమయం, మార్కెట్లో అమ్మకానికి అనుకూలమైన సమయాన్ని ముందు గానే నిర్ణయించుకోగలుగుతున్నారని వివరించారు. ఈ ప్రాజెక్ట్ అమలుకు ప్రభుత్వ సహకారం అందిం చాలని ప్రతినిధులు మంత్రిని కోరారు. దీనిపై సమగ్రంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకో వాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ గారిని మంత్రి ఆదేశించారు.

# ఫార్మా ల్యాబ్‌లో పేలిన రియాక్టర్.. 9 మందికి గాయాలు

నల్లగొండ,న్యూస్‌వార్ ప్రతినిధి

: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పేరేపల్లి గ్రామశివారులోని నోష్ ఫార్మా ల్యాబ్‌లో ఈరోజు (శుక్రవారం) రియాక్టర్ పేలింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. మేడే రోజే ఈ దుర్ఘటన జరగడం కార్మికులలో ఆందోళనను మరింత పెంచింది. పేరేపల్లి గ్రామ శివారులో ఉన్న నోష్ ఫార్మా కంపెనీలోని బ్లాక్-3లో ఈరోజు ఒక్కసారిగా రియాక్టర్ పేలింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో బ్లాక్‌లో పని చేస్తున్న 9 మంది కార్మికులు గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. గాయపడిన వారిని తక్షణమే స్థానిక ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులు వేర్వేరు రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులుగా తెలుస్తోంది.

### ఆందోళన కలిగిస్తున్న వరుస ప్రమాదాలు

ఈ కంపెనీలో భద్రతా ప్రమాణాలు ఎంతవరకు పాటిస్తున్నారని కార్మిక సంఘాలు, స్థానికులు యజమాన్యాన్ని ప్రశ్నిస్తున్నారు. 20 రోజుల క్రితమే ఇదే కంపెనీలోని రెండో బ్లాక్‌లో రియాక్టర్ పేలిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. 20 రోజుల వ్యవధిలోనే రెండుసార్లు ఇలాంటి భారీ ప్రమాదాలు జరగడం యాజమాన్యం నిర్లక్ష్యాన్ని, భద్రతా లోపాలను ఎత్తిచూపుతోంది. కార్మికుల కోసం కేటాయించిన మేడే రోజే విధి నిర్వహణలో ఉండి ప్రమాదానికి గురికావడంపై కార్మిక సంఘాలు యజమాన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

### ఫార్మా కంపెనీలలో రియాక్టర్ పేలుళ్లకు కారణాలు

సాధారణంగా ఫార్మా కంపెనీల్లో ఇలాంటి ప్రమాదాలు ఈ కారణాల వల్ల జరుగుతుంటాయని సంబంధిత అధికారులు తెలిపారు. రియాక్షన్ సమయంలో ఉష్ణోగ్రత ఎక్కువగా పెరిగితే ఒత్తిడి తట్టుకోలేక రియాక్టర్ పేలే అవకాశాలు ఉంటాయని తెలిపారు. పాతబడిన యంత్రాలు లేదా తుప్పు పట్టిన పైపుల వల్ల గ్యాస్ లీకేజీ జరుగుతుంటాయని చెప్పారు. రసాయనాలను కలిపేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

### కఠిన చర్యలు తీసుకోవాలి..

వరుస ప్రమాదాలకు కారణమైన నోష్ ఫార్మాపై కఠిన చర్యలు తీసుకోవాలని, వెంటనే విచారణ జరిపించాలని కార్మిక సంఘాలు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, భారీగా నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు. జిల్లా అధికారులు అన్ని ఫార్మా కంపెనీల్లో 'సేఫ్టీ ఆడిట్' నిర్వహించి, నిబంధనలు పాటించని కంపెనీలను వెంటనే సీజ్ చేయాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి. జిల్లా కలెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి (గ్రాజదీ) అధికారులు ఈ ఘటనపై స్పందించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి.

# ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి: మంత్రి పొన్నం

సిద్దిపేట జిల్లా, న్యూస్‌వార్ ప్రతినిధి

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని తెలిపారు. 140 సంవత్సరాలుగా ఏదో ఒక హక్కు డిమాండ్‌తో మేడే నిర్వహించుకుం టున్నామని పేర్కొన్నారు. ఈరోజు (శుక్రవారం) సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్టీసీ బస్సు డిపోలో నిర్వహించిన మేడే ఉత్సవాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్‌కి శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులు సమ్మెకు వెళ్తే వారి ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి వర్గం కార్మిక సంఘాలతో చర్చించి పలు అంశాలపై సానుకూల నిర్ణయం తీసుకున్నామని ప్రస్తావించారు. ఈ సమావేశంలో చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నామని వెల్లడించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘాల ఎన్నికలు, కార్మికులకు 11 శాతం పీఆర్సీ ప్రకటించామని స్పష్టం చేశారు. త్వరలోనే కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ ప్రక్రియను గుర్తింపు పొందిన సంఘం అధికారు ల కమిటీ పూర్తి చేస్తుందని తెలిపారు. ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా తాము వ్యవహరిస్తున్నామని అన్నారు. ఆర్టీసీపై ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, కేబినెట్ మంత్రులు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. హైదరాబాద్‌లో కొత్తగా 380 రూట్‌లలో కొత్తబస్సులు నడుస్తున్నాయని చెప్పుకొచ్చారు. 7 లక్షల మంది ప్రయాణికులకు కనెక్టివిటీ పెంచామని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రవాణా శాఖ మంత్రిగా.. ప్రభుత్వానికి వారధిగా ఉంటానని స్పష్టం చేశారు. హక్కుల కోసం ఏవిధంగా పోరాడామో సంస్థ అభివృద్ధికి కార్మికులు సమష్టిగా పనిచేయాలని సూచించారు.

# కమర్షియల్ గ్యాస్ ధర పెంపుపై మంత్రి ఉత్తమ్ సీరియస్..

హైదరాబాద్: న్యూస్‌వార్ ప్రతినిధి

కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం అమాంతం పెంచి సామాన్యుడి నడ్డి విరిచిందని తెలంగాణ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీపై మంత్రి ఫైర్ అయ్యారు. గ్యాస్ ధర పెంపుతో సామాన్యుడిపై పెను భారం మోపారంటూ ఆగ్రహించారు. 19 కేజీల గ్యాస్ సిలిండర్ ధరను రూ.993లకు అంటే సుమారు వెయ్యి రూపాయలకు పెంచడం దుర్మార్గమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు.ఒక్కసారిగా 30 నుంచి 35 శాతం పెంచడంతో హోటళ్లు, రెస్టారెంట్లతో సహా చిన్నచిన్న వీధి వ్యాపారులపైనా తీవ్ర ప్రభావం పడనుందని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిసి 24 గంటలు పూర్తి కాగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తీవ్ర విమర్శలు గుప్పించారు. కమర్షియల్ గ్యాస్ ధర పెంపుతో సామాన్యుల జీవన ప్రమాణాలపై కోలుకోలేని దెబ్బ పడిందని మంత్రి ఆరోపించారు. మోదీ ప్రభుత్వం తక్షణమే స్పందించి ధరల పెంపు నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. కాగా, కమర్షియల్ గ్యాస్ ధరను పెంచుతూ మోదీ సర్కార్ ఈరోజు ఉదయం ఉత్తర్వులు జారీ చేసింది. 19 కేజీల సిలిండర్‌పై ఏకంగా రూ.993 పెంచింది. దీంతో ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో 19 కేజీల సిలిండర్ ధర రూ.3071.50కి చేరింది. కేంద్రం నిర్ణయంపై దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిసిన వెంటనే మోదీ ప్రభుత్వం యథావిధిగా ధరలు పెంచేసిందని ఆగ్రహిస్తున్నాయి. సామాన్యుడి నడ్డి విరిచేలా తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

# రైతులను వెంటనే ఆదుకోవాలి: సీఎం రేవంత్‌కు బండి సంజయ్ లేఖ

కరీంనగర్,

రాష్ట్రంలోని రైతులను వెంటనే ఆదుకోవాలని సీఎం రేవంత్ రెడ్డిని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్నదాతలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయకుంటే ఆందోళన తప్పదని సీఎం రేవంత్ రెడ్డిని ఆయన హెచ్చరించారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి బండి సంజయ్ బహిరంగ లేఖ రాశారు.అన్నదాతల ఆశలు సమాధి చేశారు.. ఆరుగాలం కష్టాన్ని ఆవిరి చేస్తారా? అంటూ రేవంత్ రెడ్డిపై బండి సంజయ్ నిప్పులు చెరిగారు. తాలు, తరుగు, తేమ లేకుండా వడ్లు కొంటామని ఇచ్చిన హామీని సమాధి చేశారా? అంటూ ఆయనను సూటిగా ప్రశ్నించారు. మీ కళ్ల ముందే తాలు, తేమ పేరుతో రైతులను నిలువునా ముంచుతున్నా పట్టించుకోరా? అంటూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.మండుటెండల్లో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడుతున్న ఇబ్బందులు మీకు పట్టవా? అంటూ సీఎంను బండి సంజయ్ సూటిగా ప్రశ్నించారు. వడ్లకు బోనస్ హామీ అంతా ఉత్తిదేనా? అని నిలదీశారు. గత రబీ సీజన్‌కూ బోనస్ ఎగ్గొట్టారని.. ఈ సీజన్‌లో బోనస్‌కు పాతరేసినట్లేనా? అంటూ సీఎం రేవంత్‌పై మండిపడ్డారు.పత్తి పంటకు ఎం.ఎస్.పి(కనీస మద్దతు ధర) ఎగ్గొట్టి రైతులను ముంచారని రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి



ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కజొన్నకు కేంద్రం ఎం.ఎస్.పి ఇస్తున్నా కొనుగోలు బాధ్యతను విస్మరించి.. దళారులకు కొమ్ముకాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అకాల వర్షాల కారణంగా ఈ రెండున్నరేళ్లలో 5 లక్షలకుపైగా ఎకరాల్లో పంట నష్టం జరిగితే ఏం చేశారంటూ? సీఎం రేవంత్‌ను ఆయన బల్ల గుద్ది ప్రశ్నించారు. ఎకరాకు రూ.10 వేల చొప్పున రూ.5 వేల కోట్లు చెల్లించాల్సి ఉందని.. కానీ రూ.260 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుంటారా? అంటూ సీఎం తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు.

న్యూస్ వార్ వార్తా పత్రిక

**సంపాదకీయం...**

# లేబర్ కోడ్స్‌ను ప్రతిఘటిద్దాం

కార్మికులారా ఏకంకండి! పోరాడండి! పోరాడితే పోయేదేమీ లేదు! బానిస సంకెళ్లు తప్పా!! ఈ నినాదం 180 సంవత్సరాల క్రితం కార్మికులు వివిధ పరిశ్రమలలో వారు చేస్తున్న పని పరిస్థితులపైన, జీవన పని విధానంపైన, వారు రోజువారీగా చేస్తున్న పని గంటలు.. పొందుతున్న వేతనాలు.. అందుతున్న సౌకర్యాలపై లోతు గా పరిశీలించి కార్మికులను సంఘటితపరచాల్సిన అవసరం ఉందని.. అందుకు రూపొందించిన కమ్యూనిస్టు ప్రణాళికలో కారల్ మార్క్, ఫెడరిక్ ఎంగిల్స్ ఉద్బోధించారు. అటు తర్వాత 1886లో చికాగో నగరంలో కార్మిక వర్గం ఎనిమిదిగంటల పని దినంకోసం ఉద్యమించారు. ఈ ఉద్యమమే అన్ని పట్టణాలకు మహాప్రళయంగా విస్తరించింది.. 8 గంటల పని దినం కోసం జరిగిన పోరాటంలో కార్మికులు తుపాకీ గుళ్లకు బలైనారు. రక్తతర్పణం చేసినారు.. వారికి సంఘీభావంగా ప్రపంచంలోని వివిధ పారిశ్రామిక నగరాలలో ప్రదర్శనలు జరిగినవి. వారికి సంఘీభావంగా ఎనిమిదిగంటల పని దినం కోసం మే 1న కార్మిక పోరాటాల సంఘీభావ దినం జరుపుకోవాలని అంతర్జాతీయ కార్మిక సమాఖ్య పిలుపునిచ్చింది.

నాటి నుండి మే డేను కార్మిక దినోత్సవంగా జరుపుకుంటూ వస్తున్నారు. మే డే అంటేనే కార్మికుల చెమట, త్యాగం, పోరాటం, ఐక్యతకు ప్రతీక. 1886లో 8 గంటల పని దినం కోసం చికాగో వీధిల్లో ప్రాణాలు అర్పించిన కార్మికుల స్ఫూర్తిని గుర్తుచేసే రోజు. కార్మికులకు హక్కులు ఎవరూ దానం చేయలేదని, పోరాటాలు నేర్పిన చారిత్రకమైన రోజు మే డే. భారతదేశంలో పాలకులు అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు అమల్లోనికి తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ కార్మికుల హక్కులపై తీవ్రమైన దాడికి గురిచేస్తున్నాయి. దశాబ్దాల పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను ఒకే గొడుగు కిందికి తెచ్చినట్టు చెప్పినా అసలు ఉద్దేశం యజమానులకు మరింత స్వేచ్ఛ ఇవ్వడం కార్మికులను మరింత రక్షణలులేని హీనస్థితికి నెట్టడం, పని గంటలు పెరగడం, కనీస వేతనాలు పెంపు లేకుండా చేయడం, యూనియన్ హక్కులు బలహీనపరచడం, సమ్మె హక్కుపై పరిమితులు విధించడం, కాంట్రాక్టు ఉద్యోగాలను విస్తరించడం లాంటి తదితర అంశాలు ఈ లేబర్ కోడ్స్‌లో దాగి ఉన్నాయి. ఇవి కార్మిక సంక్షేమానికి కాదు, కార్పొరేట్ లాభాలకు సేవ చేసే విధానాలుగా ప్రభుత్వం రూపొందించినది. ప్రత్యేకంగా అసంఘటిత రంగ కార్మికులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, మహిళా కార్మికులు, యువత ఈ లేబర్ కోడ్స్ ప్రభావానికి ఎక్కువగా గురవుతారు. ఇప్పటికే ఉపాధి భద్రత లేకుండా, తక్కువ వేతనాలతో సామాజిక భద్రత లేకుండా జీవిస్తున్న కోట్లాది మంది కార్మికుల జీవితాలు మరింత కష్టాల్లో పడే ప్రమాదం ఉంది. . కార్మిక వర్గం ఐక్యమైతే ఏ దాడినైనా ఎదుర్కోగలం. గతంలోనూ కార్మికులు సంఘటిత శక్తితోనే కనీస వేతనం, పని గంటలు, సెలవులు, పి.ఎఫ్, ఇఎస్ఐ వంటి సామాజిక హక్కులను సాధించుకున్నారు. నేడు అదే ఐక్యతతో లేబర్ కోడ్స్‌పై దేశవ్యాప్తంగా ప్రతిఘటన నిర్మించాల్సిన అవసరం ఉంది. ప్రపంచ నలుమూలలా 10.5 కోట్ల మందికి పైగా కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న'అంతర్జాతీయ కార్మిక సంఘాల సంఘం' (డబ్ల్యుఎఫ్‌టియు) 140 ఏళ్ల క్రితం చికాగో మార్గదర్శకుల డిమాండ్లు ఎంత అవసరమో, నేటికీ అంతే అత్యవసరం అని పేర్కొంది.' సామాజిక అసమానతలు విపరీతంగా పెరుగుతున్నాయి, ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య స్వేచ్ఛలు, కార్మిక సంఘాల హక్కులపై దాడులు జరుగుతున్నాయి. అదే సమయంలో సామ్రాజ్యవాద యుద్ధాలు, జోక్యాలు ఎజెండాలో ఉన్నాయి'.



మహిళా కార్మికులు, యువత, వలస కార్మికులు తీవ్రమైన దోపిడీ, తక్కువ వేతనాలు, అధిక ఉద్యోగ భద్రత, ఆరోగ్యం, విద్య, సంస్కృతికి పరిమితంగా అందుబాటులో ఉండటాన్ని ఎదుర్కొంటూనే ఉన్నారని తెలిపింది. కార్మిక వ్యతిరేక విధానాలు, కార్మిక నియంత్రణల సడలింపుకు వారే మొదటి బాధితులు, ఇది వారిని పెట్టుబడిదారుల దాడులకు ప్రత్యేకంగా గురిచేస్తుంది'. కార్మిక సంఘాల నాయకులపైనా, ప్రజాస్వామ్య స్వేచ్ఛలపైనా ప్రభుత్వ కార్పొరేట్ సంస్థల అణచివేత ప్రపంచ వ్యాప్తంగా తీవ్రమవుతుందని, జనార్థులను దాదాపు ఎలాంటి హక్కులు లేని చోట శ్రమశక్తిగా వాడుకుంటున్నారు. సమ్మెలను నేరంగా పరిగణిస్తున్నారు. వలసదారులను, శరణార్థులను దాదాపు ఎలాంటి హక్కులు లేని చవక శ్రమశక్తిగా వాడుకుంటున్నారు. జాతి వివక్ష, దోపిడీలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. ఇంధనసంక్షోభం, ద్రవ్యోల్బణం, అధిక ధరలు కార్మికుల ఆదాయాలను క్షీణింపజేస్తుండగా, వేతనాలు స్తంభించిపోయాయి. బహుళ జాతి సంస్థల లాభాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దీనిని ఎదుర్కొన్నప్పుడు అంతర్జాతీయ కార్మిక వర్గం పోరాడటమే ప్రతిస్పందనగా ఉండాలని డబ్ల్యుఎఫ్‌టియు పేర్కొంది.కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ కార్మికుల హక్కులను హరించే విధంగా ఉన్నందున.. కార్మిక వర్గ భవిష్యత్తును కాపాడుకోవడం నేటి తక్షణ కర్తవ్యం! రాబోయే తరాలకోసం కూడా! కార్మికుల హక్కులు బలహీనమైతే ప్రజాస్వామ్యం కూడా బలహీనమవుతుంది. ప్రతి కార్మికుడు మే డే రోజు 'లేబర్ కోడ్స్‌ను తిప్పి కొడదాం, కార్మిక హక్కులను కాపాడుదాం'.. కార్మిక వర్గ విముక్తి కోసం ఐక్యంగా ముందుకు సాగుదాం.. మేడే స్ఫూర్తి కార్మికులలో చైతన్యం నింపాలి. పోరాటమే మార్గమని, ఐక్యతే ఆయుధమని గుర్తు చేయాలి.

# పోరాటాలతోనే కార్మిక హక్కులకు రక్షణ

### కార్పొరేట్ సంతుష్టీకరణలో పాలకులు

### అనేక ఆందోళనతో అడ్డుకుంటూనే ఉన్నాం

### సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వి నాగేశ్వరరావు

**విజయవాడ**

ప్రభుత్వాలు కార్మికుల హక్కులపైనే కాక జీవితాలపైన, ప్రజాస్వామ్య హక్కులపైన, రాజ్యాంగ హక్కులపై దాడి చేస్తున్నాయి. ఈ హక్కులను కాపాడుకోవడానికి యావత్ కార్మికవర్గం పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. లేబర్‌కోడ్లను రద్దు చేయాలని, కార్మిక హక్కులు అమలు కావాలని అన్నారు. నిరంతరం కార్మిక దోపిడీ జరుగుతున్నా పాలకుల్లో చలనం లేదన్నారు. ఏటేటా మేడేలు జరుపుకోవడం తప్ప కార్మికుల పక్షాన నిర్ణయాలు తీసుకోవడం లేదని ఆయన ఆవేదన చెందారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకై మానవ హారాలు, పాదయాత్రలు, మహాప్రదర్శనలు నిర్వహించారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐదు సంవత్సరాలుగా రాజీ లేని పోరాటాలు సాగుతున్నాయి. వీటి ఫలితంగా నేటి వరకూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై ముందుకు సాగలేకపోయిందన్నారు. అయితే దానిని అభివృద్ధి చేసి, దానికి గనులు కేటాయించి, మరింత పటిష్టంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేయడం లేదన్నారు. తిరుపతి టిటిడి ఫారెస్టు కార్మికులు 38 నెలల పాటు ఆందోళనలు కొనసాగించారు. అనేక ఒత్తిళ్లు చేసినా కార్మికులు పోరాటాన్ని ఆపలేదన్నారు. విజయనగరం మిమ్స్ మెడికల్ కాలేజీ కార్మికులు 80 రోజుల పాటు పోరాటాలు చేశారు. 32 మందిపై అక్రమ కేసులు బనాయించారు. ఇద్దరు సిఐటియు నాయకులతో సహా 19 మంది కార్మికులను విశాఖ సెంట్రల్ జైలుకు 14 రోజులు రిమాండ్‌కు పంపారు. అయినా ఈ నిర్బంధాన్ని ఎదిరించి కార్మికులు పోరాటాన్ని కొనసాగించారు. నెల్లూరు మున్సిపాల్టీలో వర్క్ ఔట్‌సోర్సింగ్ విధానాన్ని అనుసరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం టెంటర్లు పిలవడానికి వ్యతిరేకంగా కార్మికులు 14 రోజుల పాటు సమరశీలంగా సమ్మె నిర్వహించారు. పోలీసు నిర్బంధాన్ని ఎదుర్కొని సమ్మెను జయప్రదంగా నిర్వహించారు. దీంతో ప్రభుత్వం టెండర్లను ఉపసంహరించుకోవడమే కాక, కార్మికులపై అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తివేయక తప్పలేదు. విశాఖ డెయిరీ



కార్మికుల పోరాటం, సినర్జీస్ కార్మికుల సమ్మె, బ్రాండిక్స్ కార్మికుల మూడు రోజుల సమ్మె, రాజమండ్రి ఆంధ్రా పేపర్‌మిల్లు కార్మికులు 2,500 మంది 34 రోజుల సమ్మె, ఎన్‌టిఆర్ జిల్లా ముఠా కార్మికుల సమ్మెలు ఈ కాలంలో జరిగాయి. కార్మికులు పోరాటాలతో కొన్ని విజయాలు సాధించుకోగలిగారు. నెల్లూరులో జెన్కోను అదానీకి కట్టబెట్టే ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ 396 రోజుల ఆందోళనను కార్మికులందరూ కలసి నిర్వహించారు. కార్మికులు, ఇంజినీర్లు కలసి సిఐటియు చొరవతో జెఎసి గా ఏర్పడి పోరాడారు. ప్రజల మద్దతు పొందారు. ప్రైవేటీకరణ ప్రతిపాదనను వెనక్కి నెట్టారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీలు 42 రోజుల పాటు ఎస్మాను సైతం ధిక్కరించి, నిర్బంధాన్ని ఎదురించి సమరశీలంగా సమ్మె నిర్వహించారు. గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్, రిటైర్మెంట్ వయసు పెంపు, హెల్పర్ల ప్రమోషన్‌కు వయోపరిమితి పెంపు, మినీ అంగన్‌వాడీ సెంటర్లు మెయిన్ సెంటర్లుగా మార్పు, సమ్మె కాలపు వేతనాలు తదితర జీఓలను సాధించుకున్నారు. మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు 16 రోజుల సమ్మెను సమరశీలంగా నిర్వహించారు. వేతన పెంపు, ఇతర సమస్యలు పరిష్కరించుకున్నారు. సమగ్రశిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 22 రోజులు సమ్మె నిర్వహించారు. దాదాపు 8 వేల మంది ఉద్యోగులు 23 శాతం వేతన పెంపు, సమ్మె కాలపు వేతనాలు సాధించుకున్నారు. ఆశా కార్మికులు సమరశీలంగా అనేక పోరాటాలు నిర్వహించి గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్లు, ప్రసూతి సెలవులు, పదవీ విరమణ వయసు పెంపులను సాధించుకున్నారు. మధ్యాహ్న భోజనం, భవన నిర్మాణం, ట్రాన్స్‌పోర్ట్ తదితర రంగాల్లోనూ పోరాటాలను నిర్వహించారు. రాజీ లేకుండా సమరశీలంగా ఫలితం వచ్చేదాకా పోరాడ్డం ద్వారా కార్మికవర్గం విజయాలు సాధించగలదని, ప్రభుత్వ విధానాలను వెనక్కి కొట్టగలదని తేటతెల్లమైందని నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ పోరాటాల వలన ఆయా కార్మికుల్లో పోరాట స్ఫూర్తిని పెంచాయి. రాష్ట్రంలో, కేంద్రంలో ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను భవిష్యత్తులో ఐక్య పోరాటాల ద్వారానే తిప్పి కొట్టగలం అన్నారు.

## ఒకటో తేదీన జీతాలు రావడం లేదు

### ఎమ్మెల్యేకు అంగన్‌వాడీల స్పష్టీకరణ

**మహబూబాబాద్,**

కాంగ్రెస్ ప్రజాపాలన అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి నెలా ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రూనాయక్ పేర్కొన్నారు. దీంతో అక్కడే ఉన్న అంగన్‌వాడీలు 'అయ్యో సార్ మాకు ఒకటో తేదీన జీతాలు రావడంలేదు' అని ముక్తకంఠంతో ఎమ్మెల్యే ప్రసంగానికి అడ్డుతగిలారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని రైతువేదికలో కల్యాణలక్ష్మి చెక్కులు, అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. రామచంద్రూనాయక్ మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు ఇస్తున్నామని తెలిపారు. దీంతో అక్కడే ఉన్న అంగన్‌వాడీ కలుగజేసుకొని 'సార్ మాకు మాత్రం జీతాలు రావడం లేదు' అని ప్రసంగానికి అడ్డుతగిలారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిలో జీతాలు పెంచాలనే అంశం ఉందని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని చెప్పగా.. 'సార్ మాకు పోయిన నెల జీతం రూ.13,650 ఇప్పటి వరకు రాలేదు' అని అంగన్‌వాడీలు గుసగుసలాడారు.

## అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం

### అతివేగంతో పాదచారులను ఢీకొన్న కారు

### ప్రమాదంలో నలుగురు వ్యక్తులు దుర్మరణం

**విజయనగరం,**

పూసపాటిరేగ మండలం పేరాపురం వద్ద జాతీయ రహదారి 16పై సోమవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నలుగురు దుర్మరణం చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నానికి వెళ్తున్న గుత్తేదారుల మిత్ర బృందం ప్రయాణిస్తున్న కారు మితిమీరిన వేగం వల్లే ఈ ప్రమాదం జరిగింది. రాత్రి 12 గంటల సమయంలో అతివేగంగా వచ్చిన కారు.. పేరాపురం వద్ద దుకాణంలో టీ తాగి రోడ్డుపై ఉన్న ఇద్దరు పాదచారులను ఢీకొట్టింది. అనంతరం వాహనాన్ని అదుపు చేయలేక సమీపంలో ఆగి ఉన్న లారీ వైపు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒకరు.. పాదచారులిద్దరూ అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. కారు చోదకుడితో పాటు తీవ్రంగా గాయపడిన మరొకరిని విజయనగరంలోని మహారాజా ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా ఒకరు మార్గమధ్యలో మృతి చెందారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి బొబ్బిలి వాసిగా పోలీసులు గుర్తించారు. ప్రమాదంలో విశాఖకు చెందిన ఇరిగేషన్ కాంట్రాక్టరు శ్రీనివాస్ మృతి చెందినట్లు భావిస్తున్నారు. కారులో ప్రయాణిస్తున్న వారిలో అమరావతికి చెందిన ఓ న్యాయమూర్తి బంధువులు ఉన్నారని తెలిసింది. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. సీఐ రామకృష్ణ, ఎస్సై దుర్గాప్రసాద్‌తో కలిసి సహాయక చర్యలు చేపట్టారు.

## ఘనంగా స్వాగతం పలికిన టిడిపి నేతలు

**విశాఖపట్నం**

విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు ఘనంగా స్వాగతం లభించింది. నగరానికి విచ్చేసిన మంత్రికి టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. టీడీపీ నేత చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో 'జాబ్ క్రియేటర్ ఇన్ చీఫ్ (వైజాగ్)' అంటూ ప్లకార్డులు పట్టుకుని ఘనంగా స్వాగతించారు. ఎయిర్‌పోర్టు వద్ద మంత్రి లోకేశ్ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలు, గూగుల్ ప్రతినిధుల తేనీటి విందులో పాల్గొనేందుకు నగరానికి లోకేశ్ వచ్చారు.

## వేగవంతంగా ధాన్యం కొనుగోలు పక్రియ

### అధికారులను ఆదేశించిన కలెక్టర్ ప్రతిమా సింగ్

### హవేలీ ఘన్‌పూర్ మండల కేంద్రం ఆకస్మిక తనిఖీ

**మెదక్,**

:మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు పక్రియ వేగవంతంగా జరగాలని.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కేంద్ర నిర్వాహకులను, వ్యవసాయ, సివిల్ సప్లై అధికారులను జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. మెదక్ జిల్లా హవేలీ ఘన్పూర్ మండల కేంద్రంలోని ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్బంగా కలెక్టర్ ధాన్యం కొనుగోలు వివరాలు, అందుబాటులో ఉన్న టార్పాలిన్ కవర్లు, గన్ని బ్యాగులు, కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు తరలింపు తదితర వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగంగా జరగాలని ఇప్పటి వరకు 880. మంది రైతుల నుండి 4270. 040 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడం జరిగిందని 38 మంది రైతులకు -42 లక్షల రూపాయలు ఖాతాలో జమ చేశామన్నారు. ధాన్యం కొనుగోలు పక్రియ సాఫీగా సాగేందుకు?మూడు దశల్లో టోకెన్ పద్దతి ని పెట్టడం జరిగిందని.. దీనిని ఆయా శాఖల అధికారులు తూ. చ తప్పకుండ పాటించాలని తద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా?తేమ శాతం వచ్చిన ధాన్యం వేగం గా కొనుగోలు అవ్వడం జరుగుతుందన్నారు. కొనుగోలు పక్రియ పూర్తి కాగానే వెంటనే ట్యాగ్ చేసిన మిల్లులకు ధాన్యం బస్తాలను తరలించాలన్నారు. రవాణా పరంగా కూడా ఎలాంటి ఆలస్యం లేకుండా తగు లారీలను నిర్వాహకులు కేంద్రాలకు సరైన సమయం లో వచ్చేలా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు. వేసవి ఎండల నేపథ్యంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఇచ్చిన టోకెన్ల ఆధారంగా కేంద్రాలకు రావాలన్నారు. అలాగే కేంద్రాలలో తాగు నీరు, నీడ తదితర మౌలిక వసతులు ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద్, సివిల్ సప్లై మేనేజర్ జగదీష్, తహసీల్దార్‌సింధు రేణుక ప్యాక్స్ కొనుగోలు కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పాదన పెంచడమే లక్ష్యం

**అమరావతి,**

విద్యుత్ కొనుగోలు ఛార్జీలు తగ్గించేందుకు ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. యూనిట్ ధరను రూ.4.60కు తగ్గించేలా కసరత్తు చేస్తోంది. సోమవారం నాడు విద్యుత్ శాఖపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో అధికారులకు సీఎం కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలో రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పాదన పెంచడమే లక్ష్యంగా చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈవీ వాహనాల వినియోగంపై ప్రజల్లో విస్తృత స్థాయి అవగాహన కల్పించాలని సూచించారు. ఇంధన రంగంలో పరిశోధనకు ప్రత్యేక ఎనర్జీ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. పీఎం సూర్య ఘర్, కుసుమ్ పథకాల అమలులో లక్ష్యాలు చేరుకునేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. విద్యుత్ వినియోగ దారులకు, నిరంతర విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ట్రాన్స్‌మిషన్ నష్టాలను గణనీయంగా తగ్గించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. విద్యుత్ కొనుగోళ్ల భారం తగ్గించుకునేందుకు ఇతర రాష్ట్రాలతో పవర్ స్వాపింగ్ ఎంఓయూలు కుదుర్చుకోవాలని అధికారులకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పీఎం కుసుమ్ సహా సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇప్పటికే కుదుర్చుకున్న ప్రాజెక్టులు 60 రోజుల్లోపు కార్యకలాపాలు ప్రారంభించేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ భవనాలపై సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాలని వారికి ఆయన స్పష్టం చేశారు.

4
నల్లగొండ
శనివారం,
2 మే 2026

న్యూస్ వార్
వార్తా పత్రిక

## పంతంగి విద్యార్థులకు ప్రశంసలు



చౌటుప్పల్ మే 1 (న్యూస్ వార్)

పంతంగి ప్రభుత్వ పాఠశాల నుండి పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులకు గ్రామ సర్పంచ్ బోయ కాకి శ్రీలత సుందర్ అభినందనలు తెలియజేసి సన్మానించారు. ముందు ముందు భవిష్యత్తులో కూడ బాగా చదివి మంచి ఫలితాలను సాధించి గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించిన వారిలో గ్రామ ఉపసర్పంచ్ బోయ సదానందం స్కూల్ హెడ్మాస్టర్ స్కూల్ చైర్మన్ రోడ్డ శంకరమ్మ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ మండల కేంద్రంలో ఘనంగా మేడే ఉత్సవాలు




చౌటుప్పల్ మే1 (న్యూస్ వార్)

మండల కేంద్రంలో సిపిఐ మరియు ఏఐటియుసి ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలల్లో భాగంగా తంగెడుపెల్లి రోడ్డులో పగిళ్ల మోహన్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ ముందు ఏఐటియుసి సివిల్ సప్లై హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు పాపగల శంకరయ్య జెండా ఎగురవేశారు. సిపిఐ పార్టీ కార్యాలయం వద్ద జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి జెండా ఎగురవేసిన అనంతరం ఆయన మాట్లాడుతు అమెరికా దేశంలోని చికాగో నగరంలో 1886 సంవత్సరం మే 1వ తేదీన రోజుకు 8 గంటల పని దినాన్ని డిమాండ్ చేస్తూ లక్షలాదిమంది కార్మికులు నిరసన ప్రదర్శన నిర్వహించగా పోలీసులు జరిపిన కాల్పుల్లో కార్మికుల రక్తంతో తడిసిన జెండానే ఎర్రజెండాగా ఎగురవేయడం జరిగిందన్నారు ఆ మేడే స్ఫూర్తితో కార్మికుల పోరాటం మరింత పదునెక్కించి ఎనిమిది గంటల పని దినాలను సాధించుకుందన్నారు. హమాలి, ఆటో, ట్రాన్స్పోర్ట్, కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని తేవాలని, 4 లేబర్ కోడ్లను, రద్దుచేసి 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని, ఆటో డ్రైవర్లకు 60 సంవత్సరాలు దాటిన వారికి 5000 రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూట్లీ ,బోనస్, పెన్షన్, చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ , మున్సిపల్ సహాయ కార్యదర్శి ఉడుత రామలింగం, బద్దుల సుధాకర్, రొండీ నరసింహ, దాసరి అంజయ్య, నీల బిక్షపతి, రోషణ గారి అంజయ్య, ఎస్ ఏ రహమాన్, దాసరి కృష్ణ, వంటల వెంకటేష్, దాసరి మనోహర్, గుండెబోయిన నరసింహ, ఉబ్బు దర్శన్, కే సైదులు, విరిగి సంజీవ, బి యాదయ్య, ఏ బాబు, దాసరి యాదయ్య పాల్గొన్నారు.

## చౌటుప్పల్లో మాధవరెడ్డి జయంతి వేడుకలు

చౌటుప్పల్ మే1 (న్యూస్ వార్)

స్వర్గీయ మాధవరెడ్డి 77వ జయంతిని పురస్కరించుకుని చౌటుప్పల మున్సిపల్ కేంద్రంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంశాఖ మంత్రివర్యులు స్వర్గీయ ఎలిమినేటి మాధవరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన చౌటుప్పల్ మండల్ ప్రెసిడెంట్ శ్రీ బడుగు లక్ష్మయ్య మాట్లాడుతూ స్వర్గీయ మాధవరెడ్డి సర్పంచ్ గా సమితి ప్రెసిడెంట్ గా ఎమ్మెల్యేగా మంత్రిగా హోం, పంచాయతీరాజ్, ఆరోగ్యశాఖల మంత్రివర్యులుగా పదవులను చేపట్టి సమర్థవంతంగా నిర్వహించిన మహా నాయకుడుని, గ్రామాల అభివృద్ధి కోసం ప్రజల సంక్షేమం కోసం నిరంతరము ఆలోచించి గ్రామాల అభివృద్ధి కోసం పనిచేసిన ప్రజల మనిషని తెలుగుదేశం పార్టీలో ప్రధాన కార్యదర్శిగా ఎన్టీఆర్ సమక్షంలో పనిచేసి సమర్థవంతమైన నాయకునిగా పేరు తెచ్చుకున్నాడని అన్నారు. మాధవ రెడ్డి ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్క తెలుగుదేశం కార్యకర్త పని చేయాలని వారి ఆశయాన్ని నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు నల్ల పర్వతాలు యాదవ్ మారగోని అశోక్ గౌడ్ ఎడ్లరామిరెడ్డి సీనియర్ నాయకులు గుమ్మడి అంజిరెడ్డి మండల అధికార ప్రతినిధి రఘుపతి మండల కార్యనిర్వాహక కార్యదర్శి తడక కోటేష్ గ్రామ శాఖ అధ్యక్షులు వెంకటేశం సింగిరెడ్డి సురేందర్ రెడ్డి సీతయ్య టిఎన్టిసి జిల్లా



అధ్యక్షులు బొంగు బాదుషా మండల బిసి సెల్ అధ్యక్షులు గోవిందా చారి చెరుకు అశోక్ గౌడ్ మాజీ ఎంపిటిసి గ్యారేజ్ కిష్టయ్య మాజీ అధ్యక్షుడు కంది లక్ష్మారెడ్డి మాజీ అధ్యక్షులు అంజయ్య నల్ల గణేష్ గోశిక రవి అంజయ్య సత్తయ్య ఇతరులు పాల్గొన్నారు

# కార్మికులకు రక్షణ కల్పించే ప్రతి చట్టం పోరాటం ద్వారా సాధించుకున్నదే.. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వై ఓమయ్య



నిజామాబాద్ మే 1( న్యూస్ వార్ )



మే డే సందర్భంగా ఈరోజు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి నుండి 140 ఫీట్ల ఏఐటీయూసీ జెండాతో బస్టాండ్ , ఖలీల్ వాడి చౌరస్తా భగత్ సింగ్ చౌరస్తాల మీదుగా ప్రభుత్వ మెడికల్ కళాశాల వరకు ప్రదర్శన నిర్వహించారు అనంతరం ప్రభుత్వాసుపత్రి, మెడికల్ కళాశాల, బస్టాండ్, టూరిజం హోటల్, మున్సిపల్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ హమాలీ యూనియన్, చాటా వర్కర్స్ యూనియన్, రైస్ మిల్ ఫిట్టర్స్ యూనియన్, గాంధీ గంజ్ కూరగాయల వర్తకుల సంఘం, కిషన్గంజ్, సివిల్ సప్లై గోదాం, మదీనా మార్కెట్, బోధన్ బస్టాండ్, రెండవ బస్ డిపో, అంబేద్కర్ కాలనీ కార్యాలయాల్లో ఏఐటీయూసీ జెండాలను ఆవిష్కరించిన అనంతరం జరిగిన సభలో. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వై ఓమయ్య మాట్లాడుతూ 1886 మే డే స్ఫూర్తితో భారతదేశంలో కార్మిక వర్గం 1920 నుండి ఏఐటీయూసీ సంఘాన్ని ఏర్పాటు చేసుకొని బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాడి ఎనిమిది గంటల పని మరియు పని భద్రత చట్టాలను సాధించుకోవడం జరిగిందని, భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత ఇప్పటివరకు అమలవుతున్న ప్రతి చట్టాన్ని కార్మికుల పోరాటాల ద్వారానే సాధించుకున్నారని నేడు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం 29 చట్టాలను పూర్తిగా రద్దు చేసి నాలుగు లేబర్ కోడులుగా తీసుకొచ్చి కార్మికులకు హక్కులు లేకుండా యజమానులకు హక్కుల్ని కల్పిస్తూ కార్మికుల పోరాట స్ఫూర్తిని దెబ్బతీశారని, ఏడుగురు సభ్యులు ఉంటే యూనియన్ రిజిస్ట్రేషన్ చేసే చట్టాన్ని 250 మందికి పెంచడం జరిగిందని పనిగంటలను 12 గంటలకు పెంచడం జరిగిందని కార్మికుల వేతనాలు పెంచకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని శ్రమకు తగ్గ వేతనం కోసం పని గంటల కోసం చికాగో పోరాట స్ఫూర్తితో కార్మిక వర్గం భవిష్యత్తు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు టి చక్రపాణి హైమది బేగం భాగ్యలక్ష్మి కార్యదర్శులు పి హనుమాన్లు కవిత అనిల్ దేవేందర్ ఫెరోజ్ అలీ భానుచందర్ రాధా కుమార్ అంజయ్య నరేష్ గోవర్ధన్ ప్రసాద్ నరసయ్య గణేష్ నవీన్ చిన్ను భాయ్ వివిధ రంగాల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు ఎల్.ఓ.సీ చెక్కులు అందజేత





చౌటుప్పల్ మే 1(న్యూస్ వార్)

మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో చౌటుప్పల్ మండలం కుంట్ల గూడెం గ్రామానికి చెందిన గుండు కళావతి మరియు ఎల్లం బావి గ్రామానికి చెందిన కనకాల అనితకు మంజూరైన రూ.2,50,000/- మరియు 1,50,000/- రూపాయల విలువ గల ఎల్.ఓ.సీ చెక్కులను శుక్రవారం నాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితులకు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మునుగోడు ఎన్నికల ఇన్చార్జ్ పబ్బ రాజు గౌడ్,లు అందజేశారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బోయ దేవేందర్, మున్సిపాలిటీ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాచకొండ భార్గవ్, పెద్దగోని రమేష్ గౌడ్, బండమీది వెంకటేష్,ఎల్లం బావి, కుంట్ల గూడెం, గ్రామాల నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## రైతుల పంట కూడ కొనలేని దౌర్భాగ్య ప్రభుత్వం

### ఐకెపి కేంద్రాల పరిశీలనలో కూసుకుంట్ల

చండూర్ మే 1 న్యూస్ వార్ :




మండల కేంద్రంలో టిఆర్ఎస్ కేవి కార్మికులతో కలిసి మేడే ఉత్సవాల్లో పాల్గొన్న అనంతరం మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మండలంలోని వివిధ గ్రామాల్లో ఐకెపి కేంద్రాలను కళ్ళాల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. తదనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అహర్నిశలు తమ ప్రాణాలు పణంగా పెట్టి రైతులు పంట పండిస్తే ఆ పంటలు కొనే పరిస్థితి కూడా ఈ ప్రభుత్వానికి లేకపోతే ఇంతకంటే దుర్మార్గం ఇంకొకటి ఉంటదా అని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే అధికారులతో ధాన్యం కొనిపించలేని దిక్కులేని పరిస్థితి ఈ నియోజకవర్గంలో ఉందని ఎద్దేవాచేశారు. రైతులకుయూరియా దొరకని సందర్భంలోనూ ఎమ్మెల్యే స్పందన శూన్యం అంటూ నాటి పరిస్థితిని గుర్తు చేశారు. కనీసం ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయించాలి అని డిమాండ్ చేశారు. తాలు సాకుతో ఆరుగాలం శ్రమ కోర్చి పంట పండించిన రైతుల దగ్గర నుండి ధాన్యాన్నిదోపిడీ చేస్తున్నారు అంటూ విమర్శించారు ఈ విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ తోకల వెంకన్న చండూర్ మున్సిపాలిటీ కౌన్సిలర్ తేలుకుంట్ల రాజకుమారి శేఖర్ మహిళా విభాగం అధ్యక్షురాలు గీత మొదలైన వారు పాల్గొన్నారు



## బీఆర్టియు అద్వర్యంలో మే డే ఉత్సవాలు



చౌటుప్పల్ మే 1 (న్యూస్ వార్)

మే డే కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని బీఆర్టియు కార్మిక సంఘ నాయకులు జువ్వి శివకుమార్ ఆధ్వర్యంలోకార్మిక జెండా ఆవిశ్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ కార్మికులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోగలరన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ మండల నాయకులు సర్పంచ్ గిర్కటి నిరంజన్ గౌడ్.బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి. సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు సుర్వి మల్లేశంగౌడ్. బిఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటి ఫ్లోర్ లీడర్ కానుగు శేఖర్ గౌడ్ కౌన్సిలర్లు ఉదరి యాదయ్య. రాజారత్నం ఉప సర్పంచ్ చిన్నం బాలరాజు కురుమ. మాజీ సర్పంచ్ ఆల్మస్ పేట క్రిష్ణ. మాజీ దేవాలయ చైర్మన్ దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి. మాజీ గ్రంథాలయ చైర్మన్ ఉడుగు మల్లేశం గౌడ్. నాయకులు తుర్పునూరి మల్లేష్ గౌడ్. అత్తార్ పాషా.ముర్షద పాల్గొన్నారు.

## తమ ఉనికిని కాపాడుకోవడం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పై హరీష్ రావ్ విమర్శలు

కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో రైతును రాజు చేయడమే లక్షంగా ముందుకు వెళుతు రైతులకు మంచి జరుగుతుంటే అధి ఓర్వలేని హరీష్ రావ్ నియోజకవర్గం లో రైతులు తమను ఎక్కడ మర్చిపోతారో అనే ఉద్దేశ్యం తో కేవలం తమ ఉనికిని కపాడుకోవడం కోసమే రైతులను తమ అబద్ధాలతో మోసం చేసి రెచ్చగొడుతున్నాడని చిన్నకోడూరు ఏఎంసి చైర్మన్ మీసం మహేందర్ హరీష్ రావ్ పై మండిపడ్డారు. ఈ సందర్బంగా చిన్నకోడూరు మండల కేంద్రంలో మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణంలో ఉన్నటువంటి వడ్ల కొనుగోలు సెంటర్లో ఏర్పాటు చేసిన వేలేకర్ల సమావేశంలో అయన మాట్లాడుతూ గత 10 ఏండ్ల బి ఆర్ స్ ప్రభుత్వ హయాంలో ఆర్ధిక మంత్రిగా, ఇరిగేషన్ మంత్రి గా వున్నా హరీష్ రావ్ నియోజకవర్గంలో వడగండ్ల వాన కురిసి రైతుల కొనుగోలు సెంటర్లలో వడ్లు కొట్టుకపోయి రైతులు ఏడ్చి గగ్గోలు పెట్టిన ఏనాడూ రైతులను పట్టించుకోలేదని కనీసం నియోజకవర్గంలో వున్నా ఒక్క కొనుగోలు సెంటర్ కు అయినా పోయి రైతులకు భరోసా ఇవ్వలేదని ఇప్పుడు అధికారం కోల్పోయాక రైతులపై కపట ప్రేమ చూపడం సిగ్గుచేటన్నారు. అంతేకాకుండా 2023 సంవత్సరంలో నియోజకవర్గం లో వడగండ్ల వాన కురి పేద్ద ఎత్తున రైతులు పంటలు నష్టపోతే తన అనుచరులను వెంటవేసుకొని ప్రతి గ్రామం తిరిగి ఎకరాకు 10 వేల రూపాయలు ఇస్తానని చెప్పి ఇవ్వకుండా ఎగనామం పెట్టిన ఘనత చరిత్ర హరీష్ రావ్ కే దక్కుతుందన్నారు కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వంఅని ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకట స్వామి ఆదేశాలతో మా పాలకవర్గం తో కలిసి ప్రతి కొనుగోలు సెంటర్ కు వెళ్ళీ రైతులకు కొనుగోలు విషయంలో ఎలాంటి సమస్యలు రాకుండా చివరి గింజ వరకు పారాదర్శకంగా కొనుగోలు చేయడమే మా లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ బుస్స రాజశేఖర్, డైరెక్టర్లు తాళ్లపల్లి రాజు, మాసిరెడ్డి మహిపాల్ రెడ్డి, పాకాల భూపతి రెడ్డి, అనుపాటి విజయ్ కుమార్ రెడ్డి,మండల ఉపాధ్యక్షుడు సందబోయిన పరశురాములు ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ పొన్నాల రాజేష్ నాయకులు ఉడుత జయంత్, గొట్టిపర్తి చందు,కోరిమి రాజు, బర్ల స్వామి, మహంకాళి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,